సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 22 । మే । 2025



భూసార పరీక్ష.. పంట దిగుబడికి రక్ష

భూసార పరీక్షలను నిర్వహించుకుని భూముల స్వభావం ఆధారంగా తగిన పంటలను ఎంపిక చేసుకుంటే దిగుబడులను సాధించడానికి అవకాశాలు ఉంటాయి. -8లో



వైవీయూలో స్నాతకోత్సవ సందడి

యోగి వేమన విశ్వ విద్యాలయం విద్యార్థులతో సందడిగా కనిపిస్తోంది. కాన్వకేషన్‌కు దరఖాస్తు గడువు సమీపిస్తుండడంతో విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
36.2/26.0

వాతావరణం

జిల్లాలో బుధవారం 26.0 - 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఏపీ ఈఏపీ సెట్‌కు 2493 మంది హాజరు

కడప ఎడ్యుకేషన్: ఏపీ ఈఏపీ సెట్ ఆన్‌లైన్ పరీక్షలు బుధవారం రెండు సెషన్స్‌లో జరిగాయి. జిల్లావ్యాప్తంగా 2493 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కడపలో ఐదు పరీక్షా కేంద్రాలు, ప్రొద్దుటూరులోని మూడు పరీక్షా కేంద్రాలకుగాను 2621 మంది అభ్యర్థులకుగాను 128 మంది గైర్హాజరయ్యారు. ఉదయం, సాయంత్రం రెండు సెషన్స్‌కు సంబంధించి 95.12 శాతం హాజరు నమోదయింది.

నేడు ఉద్యోగ మేళా

కడప ఎడ్యుకేషన్: కడప రిమ్స్ రోడ్డులోని స్పిరిట్స్ కాలేజీలో నవత ట్రాన్స్ పోర్ట్ కంపెనీ వారు వివిధ పోస్టులకు సంబంధించి గురువారం ఉద్యోగ నియామక ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆ కాలేజీ సంచాలకులు ఎంపీ రవీంద్ర తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఇంటర్, డిప్లొమా, డీగ్రీ పాస్ అయినవారు అర్హులని తెలిపారు. ఇందులో పాల్గొనే అభ్యర్థులు తమ సర్టిఫికెట్స్, ఫొటోస్, బ్యాంకు అకౌంట్స్ తో హాజరు కావాలని.. వివరాలకు తమ కాలేజి ఉద్యోగ నియామక అధికారి ఫోన్ నెంబర్ 988525 0955ను సంప్రదించాలని సూచించారు.

జెడ్పీలో బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్‌లో సాధారణ బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వు నెంబరు 23, ఫైనాన్స్ అండ్ ప్లానింగ్, తేది 15.05.2025 మేరకు జూన్ 2వ తేదిలోపు సాధారణ బదిలీలు జరగనున్నాయి. ఒకేచోట ఐదేళ్లు పూర్తయిన ఎంపీడీఓలు, మినిస్టీరియల్, నాల్గవ తరగతి సిబ్బంది అధికారుల అనుమతితో రిక్వెస్ట్ బదిలీ దరఖాస్తులు ఈనెల 25వ తేదీ సాయంత్రం 5.00 గంటల్లోపు జిల్లా పరిషత్ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని సీఈఓ ఓబులమ్మ తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న చోట ఐదేళ్లు సర్వీసు పూర్తయిన వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. ఏదైనా రిక్వెస్ట్, అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద బదిలీ కావాలని కోరుకునే వారు కూడా దరఖాస్తులు సమర్పించుకోవచ్చు. క్రమశిక్షణా చర్యలుగానీ లేదా శాఖాపరమైన చర్యలు ఉన్నవారు బదిలీకి అనర్హులవుతారు. సాధారణ బదిలీలపై వచ్చేనెల 3 నుంచి మళ్లీ నిషేధం అమలులోకి వస్తుందని వెల్లడించారు.

ఆర్‌డీఎస్‌ఎస్ పనుల్లో వేగం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజినీర్ ఎస్. రమణ

కడప కార్పొరేషన్: రివాంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం(ఆర్‌డీఎస్‌ఎస్) కింద మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయాలని ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎస్. రమణ ఆదేశించారు. బుధవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఆర్‌డీఎస్‌ఎస్ పథకం కింద జరుగుతున్న పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ ఆర్‌డీఎస్‌ఎస్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో త్రీఫేస్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. ఈ పనులలో వేగవంతం పెంచాలని, తద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు త్వరగా లబ్ధి చేకూరటమే కాకుండా విద్యుత్ వ్యవస్థ పటిష్టవంతంగా తయారవుతుందని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగరాజు, డీఈఈలు, ఏఈలు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కడప టీడీపీలో మినీవార్!

- మినీ మహానాడు వేదికగా బయటపడ్డ విభేదాలు
- తమ్ముళ్లలో అసంతృప్తి జ్వాల



కడప రూరల్: కడప టీడీపీలో మినీ యుద్ధమే జరుగుతోంది. ఇన్నాళ్లు లోలోపల దాగి ఉన్న తమ్ముళ్ల అసంతృప్తి జ్వాలలు మినీ మహానాడు వేదికగా ఎగిసిపడ్డాయి. పచ్చగడ్డి వేస్తే చాలు విద్వేష మంటలు భగ్గుమంటున్నాయి. తెలుగుదేశం పార్టీ కడప నియోజకవర్గం మినీ మహానాడు బుధవారం స్థానిక రాజరాజేశ్వరి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సే బీద రవిచంద్రతో పాటు మహానాడు పరిశీలకులు పత్తిపాటి కుసుమకుమారి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పని చేయని నేతలకు పెద్దపీట

ఈ సందర్భంగా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ఆవేదనతో ఉన్నారని అన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారు బైట...పనిచేయని వారు లోపల ఉన్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి మృదుస్వభావని, ఈ అంశాలను ఎమ్మెల్యే దృష్టికీ తీసుక్తే, చెపుతామంటారు..ఎప్పుడు చెపుతారో తెలియడం లేదన్నారు. రాష్ట్ర నేతలు వచ్చినప్పుడు ఎయిర్ పోర్ట్‌కు వెళితే నేను లోపలికి వెళ్లడం ఆలస్యమవుతోందన్నారు. అదే పార్టీకి ఏమాత్రం పనిచేయని వారు లోపలికి వెళ్లి దర్జాగా కూర్చుంటున్నారని అసంతృప్తిని వెళ్లగక్కారు. ఇదే వేదికపై ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, సీనియర్ నేత ఆలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డిని ఉద్దేశించి మాట్లాడారు. ఆయన పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. ఆయనను అడ్డుకోండని చెప్పడం చర్చనీయాంశంగా మారింది.

మారని పరిస్థితులు..

పార్టీలో తమ్ముళ్ల మధ్య పరిస్థితులు ఏ మాత్రం మారలేదు. మినీ మహానాడుకు అందరూ ఊహించినట్లుగానే ఆ పార్టీ సీనియర్ నేత లక్ష్మీరెడ్డి, మాజీ నగర అధ్యక్షుడు అమీర్‌బాబు, ప్రస్తుత నగర అధ్యక్షులు శివకొండారెడ్డి హాజరు కాలేదు. ఆ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి వేదికపై లక్ష్మీరెడ్డి పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారంటూ ఒక ఆడియోను వినిపించారు. తరువాత ఆ ఆడియో మార్ఫింగ్ చేశారని లక్ష్మీరెడ్డి చెప్పడంతోపాటు శ్రీనివాసులరెడ్డిపై పలు ఆరోపణలు చేస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. మినీ మహనాడు సందర్భంగానే ఇలా పలు సంఘటనలు చోటు చేసుకున్నాయి. మహానాడు లోపు తమ్ముళ్ల మధ్య ఇంకెన్ని లుకలుకలు బయట పడతాయో ఏమోనని ఆ పార్టీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

వాసువి చిల్లర రాజకీయాలు

- ఆయనవి 'మార్ఫింగ్' రాజకీయం
- నువ్వు నన్నేమీ చేయలేవు
- టీడీపీ సీనియర్ నేత లక్ష్మీరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నేత లక్ష్మీరెడ్డి

కడప రూరల్: తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆ పార్టీ సీనియర్ నేత ఆలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్ట్ పనులు చేస్తూ అంకెలను 'మార్ఫింగ్' చేయడంలో శ్రీనివాసులురెడ్డిపై దిట్ట అని విమర్శనాస్త్రాలు సంధించారు. మినీ మహానాడులో తాను పార్టీకి వ్యతిరేకంగా ఏదో మాట్లాడినట్లుగా మార్ఫింగ్ చేసి వినిపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాను ఏనాడు పార్టీ నియమాలను ఉల్లంఘించలేదన్నారు. స్థానిక ఎన్నికల్లో అధ్యక్షుడిగా శ్రీనివాసులురెడ్డి సహకారం లేకుండా ఆలంఖాన్‌పల్లెలో విజయకేతనం ఎగురవేశామన్నారు. తన కోడలు ఉమాదేవి కార్పొరేటర్‌గా గెలిచిందన్నారు. గత ఎన్నికల్లో శ్రీనివాసులురెడ్డి కడప పార్లమెంట్ టికెట్ నాకు, కడప ఎమ్మెల్యే సీటు మీకు అని చెప్పారన్నారు. యువ నేత నారా లోకేష్ కూడా కడప ఎమ్మెల్యే సీటును తన కోడలు ఉమాదేవికే ఇస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎంపీగా పోటీ చేయాలనుకున్న శ్రీనివాసులురెడ్డి కన్ను కడప ఎమ్మెల్యే స్థానంపై పడిందని అన్నారు. ఈ విషయమై ఆయన విలువలకు తిలోదకాలు ఇచ్చి రాజకీయం చేశారన్నారు. తాజాగా ఆయన తన కొడుకును కడప మేయర్‌గా చేయాలనే ప్రయత్నాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రజాదరణ కలిగిన తాము అందుకు అడ్డుపడుతామని, వాసు తమపై కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. 'వాసూ..నువ్వు నన్నేమీ చేయలేవు' అని వ్యాఖ్యానించారు. కార్పొరేటర్ ఉమాదేవి మాట్లాడుతూ పార్టీ జిల్లా అధ్యక్షుడు కడప మినీ మహానాడులో చిల్లర రాజకీయాలు చేశారన్నారు.

ప్రజా సమస్యలపై వైఎస్సార్‌సీపీ పోరాటం



ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

- ఎండీయూ ఆపరేటర్ల తొలగింపు దారుణం
- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజలతరపున నిరంతరం పోరాటాలు చేస్తుందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసపూరిత మాటలతో కాలం నెట్టుకొస్తోందని ధ్వజమెత్తారు. చంద్రబాబు నాయుడుకు కేవలం ఎన్నికల సమయంలోనే ప్రజలు గుర్తుకు వస్తారని అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనకు ప్రజలు గుర్తుండరని విమర్శించారు. ఆయనకు రాష్ట్ర భవిష్యత్తు కంటే కక్ష సాధింపు రాజకీయాలే ఎక్కువయ్యాయని మండిపడ్డారు. అనంతరం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు.

ఎంపీని కలిసిన ఎండీయూ ఆపరేటర్లు

బుధవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని పట్టణంలోని ఎండీయూ ఆపరేటర్లు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమను ఉన్నఫలంగా విధుల నుంచి తొలగించిందన్నా రు. 2027వ సంవత్సరం జనవరి వరకు అగ్రిమెంట్ ఉన్నా కూడా అక్రమంగా ప్రభుత్వం తొలగిస్తోందని ఎంపీ దృష్టికి తెచ్చారు. దీనికి ఎంపీ మాట్లాడుతూ ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడం దారుణమని, జగనన్న ప్రభుత్వంలో ఇంటి వద్దకే రేషన్ అందించడం ద్వారా ప్రజలకు మేలు జరిగిందన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై పార్టీ తరపున న్యాయ పోరాటం చేస్తామని భరోసా ఇచ్చారు.

ఒక్కరూపాయి భారం పడకుండా క్రాప్ లోన్స్ రుణాలు చేయాలి

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని రైతులు కలిశారు. ఈ సందర్భంగా వారు క్రాప్ లోన్ల విషయమై తాము పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన రైతులతో కలిసి స్థానిక స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్‌కు వెళ్లి మేనేజర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మేనేజర్‌తో మాట్లాడుతూ రైతుల మీద ఒక్క రూపాయి కూడా భారం పడకుండా క్రాప్ లోన్స్ రుణాలు చేయాలన్నారు. ప్రస్తుతం రైతులపై అధిక వడ్డీ భారం మోపడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అనంతరం కడప రీజినల్ మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

ఎంపీని కలిసిన బ్యాంక్ అధికారులు

కడప రీజినల్ బ్రాంచ్ ఆఫీస్ నుంచి చీఫ్ మేనేజర్ సీఎస్ ఆనంద్ పులివెందుల మెయిన్ బ్రాంచ్ మేనేజర్ శ్యామలారావు బుధవారం సాయంత్రం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఇంటి దగ్గరికి వెళ్లి ఆయన కలిసి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. రైతు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రైతులపై ఒక రూపాయి కూడా భారం పడకుండా చూస్తామని ఎంపీకి వివరించారు.

ఇక పుస్తకాలతో దోస్తీ!



డీఎస్సీ కోసం కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు

- ముగిసిన డీఎస్సీ దరఖాస్తు గడువు
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 29,915 దరఖాస్తులు
- మొత్తం 705 డీఎస్సీ పోస్టులు
- ఒక్కో పోస్టుకు 49 మంది అభ్యర్థులు పోటీ
- ఈనెల 15తో ముగిసిన దరఖాస్తు ప్రక్రియ
- 20 నుంచి మాక్‌టెస్ట్.... 30 నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్
- జూన్ 6 నుంచి నెలరోజులపాటు డీఎస్సీ నిర్వహణ

కడప ఎడ్యుకేషన్: డీఎస్సీ దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. పుస్తకాలతో కుస్తీ షురూ అయింది. ఎన్నడూ లేని విధంగా ఈ సారి గడువు తక్కువగా ఇవ్వడంతో అభ్యర్థుల్లో ఒత్తిడి మొదలైంది. దీనికితోడు నోటిఫికేషన్‌లో ఊహించని విధంగా మెలికలు పెట్టడంతో చాలా మంది అభ్యర్థులకు నిరాశే ఎదురైంది. ముఖ్యంగా జనరల్ అభ్యర్థులకు 45 శాతం మార్కుల నిబంధన పెట్టి వారి ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లింది.

- ఉమ్మడి కడప జిల్లా పరిధిలో ఈ డీఎస్సీ పరీక్ష కోసం 29,915 దరఖాస్తులు రాగా.. ఇందులో 15,812 మంది అభ్యర్థులు పరీక్షను రాయనున్నారు. కొందరు రెండు, మూడు పోస్టులకు దరఖాస్తు చేశారు. జిల్లాలో అన్ని యాజమాన్యాలు కలుపుకుని 705 పోస్టులు భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. గత నెల 20 నుంచి ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరణ పూర్తయింది. ఈనెల 30న హాల్‌టిక్కెట్లు విడుదల చేయనున్నారు. జూన్ 6 నుంచి పరీక్ష ప్రారంభమై జూలై 6వ తేదీ వరకు కొనసాగనుంది.

ఒక్కో పోస్టుకు 49 మంది వరకు పోటీ

అందిన దరఖాస్తుల ప్రకారం ఒక్కో పోస్టుకు 49 మంది అభ్యర్థులు పోటీ పడనున్నారు. ఈ పోటీకి తగ్గట్టుగా పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు సమయం లేకపోవడంతో చాలా మంది అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. కొందరు కోచింగ్ సెంటర్లలో, మరి కొందరు అభ్యర్థులు ఇళ్లల్లో పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

మహిళలే అత్యధికం

ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ పరీక్షకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల్లో మహిళలే అత్యధికంగా ఉన్నారు. 15812 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 9598 మంది మహిళలు ఉండగా 6214 మంది పురుషులు ఉన్నారు. కొందరు అభ్యర్థులు తమ అర్హతలను బట్టి పలు సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకున్నారు.

నీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత

- 60 మంది ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు అన్యాయం
- నాడు–నేడు కింద పాఠశాలల మరమ్మతు పనులు
- జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందురెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: వర్షాలు సంవృద్ధిగా కురిసే వరకు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో నిర్వహించిన జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుణ్యక్షేత్రమైన గండిలో లక్ష లీటర్ల సామర్థ్యంతో నీటిట్యాంకు నిర్మించేందుకు జెడ్పీ నిధుల నుంచి రూ. 25 లక్షలు మంజూరు చేస్తామని, రెండు రోజుల్లో ఇందుకు సంబంధించిన అంచనా వ్యయాలు రూపొందించి సమర్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈకి సూచించారు. కాశినాయన మండల జెడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తన స్వగ్రామమైన నాయనిపల్లెలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎర్రగుంట్ల జెడ్పీటీసీ బాలయ్య మాట్లాడుతూ వలసపల్లె గ్రామంలో మూడేళ్లుగా తాగునీటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సిమెంట్ యాజమాన్యం తవ్వకాలు చేపట్టడం వల్ల భూగర్భ జలాలు లేకుండా పోయాయన్నారు. చిలంకూరు–ఉప్పలూరు రోడ్డు అధ్వానంగా ఉందని, మరమ్మతులు చేయించాలని కోరారు.

- జెడ్పీ చైర్మన్‌రామగోవిందరెడ్డి మాట్లాడుతూ రాజంపేట బస్టాండులో టాయిలెట్ల నిర్మాణానికి అంచనాలు రూపొందించి ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈకి సూచించారు. బ్రహ్మంగారిమఠం మండలం మల్లేపల్లె చెరువు వద్దకు ఇటీవల ఈతకు వెళ్లి మృతి చెందిన పిల్లల కుటుంబాలకు కాంట్రాక్టర్ నుంచి పరిహారం ఇప్పించే విధంగా కలెక్టర్‌తో మాట్లాడాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా అనేక ఏళ్ల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న 60 మందిని తొలగించడం అన్యాయమన్నారు. ఏ కారణంతో వారిని తొలగించారో చెప్పాలని డ్వామా అధికారులను ఆయన ప్రశ్నించారు. చిన్నచిన్న తప్పులు చేసిన వారినంతా తొలగించుకుంటూపోతే డ్వామాలో ఒక్కరూ కూడా మిగలరన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఎక్స్‌రే ప్లాంట్లు, ఇతర పరికరాలను అందుబాటులో ఉంచడం మాత్రమే కాదని, వాటి నిర్వహణకు తగిన సిబ్బంది ఉండేలా చూడాలన్నారు. ఎస్సీ,ఎస్టీల ఇళ్లకు ఉచితంగా సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. నాడు–నేడు కింద జిల్లాలోని పాఠశాలల మరమ్మతు పనులు చేపడతామన్నారు. జెడ్పీ సమావేశాలకు హాజరు కాని అధికారులకు కలెక్టర్ ద్వారా షోకాజ్ నోటీసులు జారీ చేసేలా చూడాలని జెడ్పీ సీఈఓను కోరారు. జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు పిట్టు బాలయ్య మాట్లాడుతూ జూన్‌లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందువల్ల రైతులకు నాణ్యమైన సబ్సిడీ విత్తనాలు, ఎరువులు సకాలంలో సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పెండ్లిమర్రి మండలం యల్లటూరు రోడ్డుపై చిన్న వర్షానికే నీరు నిలబడుతోందని, రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టాలని కోరారు.

పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ మాట్లాడుతూ 50 ఏళ్లు దాటిన ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు పెన్షన్ మంజూరు చేస్తామంటున్న ప్రభుత్వం ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసిందా? అంటూ ప్రశ్నించారు. మైదుకూరు నియోజకవర్గంలో 25 స్మశాన వాటికల పనుల కోసం ఉపాధి హామి నిధులను వినియోగించేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక అనుమతి తెచ్చుకున్నారని, మిగతా ప్రాంతాలకు కూడా ఇలాంటి అవకాశం కల్పించాలని కోరారు. వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు కరీముల్లా తదితరులుమాట్లాడారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ ఓబులమ్మతోపాటు పలువురు జెడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య యోగం

- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి
- కడపలో ప్రారంభమైన ప్రపంచ యోగా ముందస్తు వేడుకలు



యోగా చేస్తున్న కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్, జేసీ అదితిసింగ్

కడప ఎడ్యుకేషన్: యోగాతోనే సర్వ మానవాళికి ఆరోగ్య యోగం సిద్ధిస్తుందని దైనందిన జీవితంలో యోగా భాగస్వామ్యం కావాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కడప ఇండోర్ స్టేడియంలో ముందస్తు కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తోపాటు ఎస్పీ అశోక్ కుమార్, జేసీ అదితిసింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 'యోగా మంత్'నేటి నుంచి మొదలైందన్నారు. జూన్ 21న విశాఖలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటారన్నారు. ఈ నేపథ్యంలో ఒక యాప్‌ని కూడా ప్రారంభించారని.. ఆ యాప్‌లో అందరూ రిజిస్టర్ కావచ్చన్నారు. మానసిక సమస్యలకు, శారీరక రుగ్మతలకు యోగ మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ యోగాసనాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. జేసీ అదితిసింగ్ మాట్లాడారు. కలెక్టర్ యోగాసనాలు వేసి అందరిలోనూ స్ఫూర్తి నింపారు. కేఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, డిపివో రాజ్యలక్ష్మి, డిఎంహెచ్ఓ నాగరాజు, జెడ్పి సీఈవో ఓబులమ్మ, జిల్లా అధికారులు, ఆయుష్ సిబ్బందిపాల్గొన్నారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా అభివృద్ధిలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా 20 లక్షలు మొక్కలు నాటాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని బోర్డు రూం హాల్లో డీఎఫ్ వినీత్ కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మొక్కల పెంపకం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో రెండు దశలలో జూన్ 27వ తేదీ పది లక్షల మొక్కలు, ఆగస్టు 29వ తేదీన పదిలక్షలు మొక్కల పెంపకం చేపట్టాలని అధికారులను ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటికి పండ్ల మొక్కలను పంపిణీ చేయాలని సూచించారు. డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, జిల్లా పర్యాటకశాఖ అధికారి సురేష్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

'యోగాంధ్ర 2025'పై అవగాహన కల్పించాలి

కడప సెవెన్‌రోడ్స్: జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని.. యోగాంధ్ర 2025పై జిల్లాలో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జిల్లాలో 'యోగాంధ్ర 2025' మాసోత్సవాల నిర్వహణపై.. అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర 2025 ప్రాముఖ్యతపై రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా జిల్లాలో ముందస్తు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు.

క్లుప్తంగా

ఆంగ్ల పరీక్షకు 545 మంది హాజరు

కడప ఎడ్యుకేషన్‌ : జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన పదో తరగతి అడ్వాన్స్‌డ్‌ సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 28 పరీక్షా కేంద్రాలలో 545 మంది పరీక్ష రాశారు. 259 మంది గైర్హాజరయ్యారు. డీఈఓ షేక్‌ షంషుద్దీన్‌ మూడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయని డీఈఓ తెలిపారు.

23 నుంచి తిప్పిరెడ్డిపల్లెలో వాహన ఫిట్‌నెస్‌ పరీక్ష

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : ఈ నెల 23 నుంచి పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లె వద్ద వాహన ఫిట్‌నెస్‌ పరీక్షలుంటాయని ఇన్‌చార్జి జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్‌ ప్రసాద్‌ పేర్కొన్నారు. ఊటుకూరులోని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్‌ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆటోమేటిక్‌ టెస్టింగ్‌ స్టేషన్‌ను తిప్పిరెడ్డిపల్లెలో ఏర్పాటు చేశామని, ఇకపై రవాణాశాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్‌ పరీక్షలు ఉండవన్నారు. కేంద్రం ఏర్పాటు చేసిన ఆటోమేటిక్‌ టెస్టింగ్‌ స్టేషన్‌ ట్రాక్‌లోకి వెళ్లగానే అక్కడ ఏర్పాటు చేసిన కంప్యూటర్‌ సెన్సార్ల ద్వారా వాహన సామర్థ్య పరీక్షలు పరిశీలించి సర్టిఫికెట్‌ ఇస్తారన్నారు.

పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా చెన్నకృష్ణారెడ్డి

కడప కార్పొరేషన్‌ : వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయిస్‌ అండ్‌ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా వీరం చెన్నకృష్ణారెడ్డిని నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

పాఠశాల కూల్చివేత ఘటనపై కేసు నమోదు

కడప అర్బన్‌ : కడప వన్‌టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని సీఎస్‌ఐ కాంపౌండ్‌లో న్యూ మోడల్‌ స్కూల్‌ను కూల్చివేసిన సంఘటనలో పాఠశాల కరస్పాండెంట్‌ షర్మిల ఫిర్యాదు మేరకు 17 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. జాకోబ్‌, ప్రశాంత్‌, చందు, మరో 15 మంది నిందితులుగా వున్నారన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని లింగాపురంలో వద్ద ఎరుకల కాలనీలో పేకాడుతున్నారని సమాచారం రావడంతో రూరల్‌ ఎస్‌ఐ అరుణ్‌రెడ్డి, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 25 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1.75 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

12 మందిపై కేసు నమోదు

కడప అర్బన్‌ : పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేయడంతో ఆందోళన చేసిన 12 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కడప తాలూకా పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో రామరాజుపల్లెకు చెందిన విజయ్‌(22) తన కుమార్తె(17)ను బలవంతంగా తీసుకుని వెళ్లి వివాహం చేసుకున్నాడని జయమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. విజయ్‌పై పోక్సో యాక్టు క్రింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్‌ చేశారు. అయితే తమకు అన్యాయం జరిగిందని మంళవారం రాత్రి నిందితుడి తల్లి, కుమార్తె వాస్మాల్‌ తాగి పోలీస్‌ స్టేషన్‌ ఎదుట ఆందోళన చేశారు. దీంతో నిందితుడి తల్లిదండ్రులు, బంధువులు మొత్తం 12 మందిపై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూసార పరీక్ష.. పంట దిగుబడికి రక్ష

- జిల్లా వ్యాప్తంగా 36 మండలాల్లో మట్టి నమూనాల సేకరణ ప్రారంభం
- జిల్లా లక్ష్యం – 24,288 నమూనాలు


భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

వల్లూరు : భూసార పరీక్షలను నిర్వహించుకుని భూముల స్వభావం, అందులోని పోషక విలువల ఆధారంగా తగిన పంటలను ఎంపిక చేసుకుని సాగులో మెలకువలు పాటించడం వలన అధిక దిగుబడులను సాధించడానికి అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ నిపుణులు తెలుపుతున్నారు. నేలలు తమలో సహజంగా ఇమిడి వున్న పోషక పదార్థాలతోబాటు మనం అదనంగా వేసే సేంద్రీయ , రసాయనిక ఎరువుల్లోని పోషకాలను పంటలకు అందజేస్తాయి. ఈ పోషక విలువలతో బాటు భూమిలోని చౌడు గుణం, సున్నం శాతం, నేల కాలుష్యం మొదలైన వాటి స్థాయిలను తెలుసుకోవడానికి భూసార పరీక్ష ఉపయోగపడుతుంది. అంతేగాక నేలల్లో వివిధ రకాల నేలలు వుండగా అందులో కొన్ని రకాల నేలల్లో ప్రత్యేకించి కొన్ని పంటలు సాగుకు అనుకూలంగా వుండి మంచి దిగుబడులు వస్తాయి. భూమి స్వభావాన్ని తెలుసుకోవడం ద్వారా అందుకు తగిన పంటలను సాగు చేసి మంచి ఫలితాలను పొందవచ్చు.

సాగు ఖర్చులు తగ్గించుకోవడానికి..

కనీసం రెండు లేక మూడు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలను చేయించుకుని తమ పొలాల్లోని వివిధ పోషక పదార్థాల విలువలను తెలుసుకోవడం ద్వారా తగిన మోతాదులోనే ఎరువులను వాడడానికి అవకాశం ఉంటుంది. దీని వలన అవసరమైన పోషకాలను మాత్రమే పంటలకు అందించడం వలన అనవసర ఖర్చులను తగ్గించుకోవడానికి అవకాశాలు ఉంటాయి. అంతే కాక భూమిలో నిల్వ ఉన్న వివిధ పోషకాలను సమర్థవంతంగా వినియోగించుకుని ఆశించిన దిగుబడులను పొందవచ్చు.

సరైన పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తేనే ఫలితం..

కాగా భూసార పరీక్ష నిర్వహించడంలో సరైన పద్ధతిని పాటిస్తేనే సత్ఫలితాలు ఉంటాయి. కావున భూసార పరీక్షలు నిర్వహించేటపుడు రైతులు కొన్ని జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించడం వలన మంచి ప్రయోజనం ఉంటుంది.

- పొలంలో ఇంగ్లీషు వీ అక్షరం ఆకారంలో 15 సెం.మీ వరకు పారతో గుంత తీసి అందులో పై పార నుండి కింది పార వరకు ఒక పక్కగా మట్టిని సేకరించాలి.
- ఒక ఎకరా విస్తీర్ణంలో 8 నుండి 10 చోట్ల సేకరించిన మట్టిని ఒక చోట చేర్చి బాగా కలిపి 4 భాగాలుగా చేయాలి. అందులో ఎదురెదురుగా వున్న భాగాలను తీసుకుని మిగిలిన భాగాలను తీసి వేయాలి. ఇదే విధంగా మట్టి పరిమాణం 1/2 కిలో వచ్చే వరకు చేయాలి.
- సేకరించిన మట్టిలో రాళ్లు, వేర్లు లేకుండా చేసి నీడలో ఆరబెట్టాలి.
- మట్టి నమూనా సేకరణకు రసాయనిక, సేంద్రీయ ఎరువులకు ఉపయోగించిన సంచులను వాడరాదు.
- గట్ల దగ్గర, పంట కాల్వలలో, చెట్ల కింద, ఎరువులను కుప్పలుగా వేసిన చోట, ఎప్పుడూ నీరు నిల్వ వుండే ప్రదేశంలో మట్టి నమూనాను సేకరించరాదు.
- పొలంలో చౌడు ప్రాంతం ఉన్నట్‌లెతై ప్రత్యేకంగా నమూనాను తీసి పంపాలి.
- పండ్ల తోటల సాగుకు పంట రకాన్ని బట్టి 3 నుండి 6 అడుగుల లోతు వరకు గుంతను తీసి ప్రతి అడుగుకు కొంత మట్టిని సేకరించి పంపాల్సి ఉంటుంది.

భూసార పరీక్షతో ప్రయోజనాలు..



భూసార పరీక్ష చేయించుకుని నేల స్వభావాన్ని బట్టి పంటలను సాగు చేయడం వలన మంచి ఫలితం ఉంటుంది. భూమిలోని పోషకాల విలువలను తెలుసుకోవడం ద్వారా అవసరమైన పోషకాలను మాత్రమే ఎరువుల రూపంలో వాడవచ్చు. దీంతో అనవసర ఖర్చులను తగ్గించుకోవడానికి అవకాశం ఉంది.
– ఏవీ నరసింహారెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు, కమలాపురం

వ్యవసాయ డివిజన్‌ల వారీగా మట్టి నమూనాల సేకరణ లక్ష్యాలు ఇలా ఉన్నాయి

వ్యవసాయ డివిజన్‌	మండలాల సంఖ్య	నమూనాల సంఖ్య
కడప	6	3366
కమలాపురం	4	3300
పులివెందుల	5	3696
ముద్దనూరు	4	2674
ప్రొద్దుటూరు	4	3107
మైదుకూరు	4	2904
బద్వేలు	4	1814
పోరుమామిళ్ల	5	3427
మొత్తం	36	24,288

రైతులకు ఉపయుక్తంగా భూసార పరీక్షా పత్రాలు..

సేకరించిన మట్టి నమూనాలను అందుబాటులోని భూసార పరీక్షా కేంద్రాలకు పంపితే వారు పరీక్షలు నిర్వహించి వివిధ పోషక విలువల శాతాన్ని నమోదు చేస్తారు. వీటిని కార్డులలో పొందుపరిచి రైతులకు అందచేస్తారు. ఇందులో ఉదజని సూచిక, లవణ సూచిక, సేంద్రీయ కర్బణంలతో బాటు ప్రధాన పోషకాలైన నత్రజని, బాస్వరం, పొటాషియం, సూక్ష్మ ధాతు పోషకాలైన గంధకం, జింక్‌, బోరాన్‌, ఇనుము, మాంగనీసు, రాగి వంటి వాటి విలువల శాతాన్ని నమోదు చేస్తారు. దీనితో బాటు సాధారణంగా అవి ఉండాల్సిన శాతాన్ని బట్టి పరీక్షల్లో నమోదైన విలువల స్థాయిలను తక్కువ, ఎక్కువ, సాధారణం, మధ్యస్థం, అతి తక్కువ, అతి ఎక్కువ వంటి వివరాలతో సూచిస్తారు. వీటిని ఆధారంగా చేసుకుని పంటలకు వాడాల్సిన ఎరువుల మోతాదులను, వాడే విధానాలను సైతం సూచిస్తారు. ఇవి పాటించడం వలన రైతులు పంటల సాగులో ఖర్చులను తగ్గించుకుని నికర ఆదాయాన్ని పెంపొందిచుకునే అవకాశాలు వున్నాయి.

ఈ క్రమంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో భూసార పరీక్షల నిర్వహణకు గానూ మట్టి నమూనా సేకరణను ఇప్పటికే ప్రారంభించారు. గత ఏడాది మట్టి నమూనాల సేకరణ లక్ష్యం 17800 కాగా, 2025– 26 సంవత్సరానికి గానూ జిల్లా వ్యాప్తంగా 36 మండలాల్లో మొత్తం 24,288 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు.

‘మహానాడు’ వేదిక వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలన


మహానాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఐజీ కోయప్రవీణ్‌, ఎస్పీలు

కడప అర్బన్‌ : ఈ నెల 27, 28, 29వతేదీలలో సికె.న్నె పరిధిలోని పబ్బాపురంలో జరగనున్న ‘మహానాడు’ వేదిక వద్ద భద్రతా ఏర్పాట్లను కర్నూలు రేంజ్‌ డీఐజీ డా.కోయ ప్రవీణ్‌, కడప, అన్నమయ్య, నంద్యాల జిల్లా ఎస్పీలు ఈజీ.అశోక్‌కుమార్‌, వి.విద్యాసాగర్‌నాయుడు, అధిరాజ్‌సింగ్‌రాణా బుధవారం పరిశీలించారు. పార్కింగ్‌ ప్రదేశాలు, ప్రధాన వేదిక, ఫుడ్‌ కోర్ట్‌ల వద్ద చేపట్టాల్సిన బందోబస్తుపై సిబ్బందికి డీఐజీ దిశా నిర్దేశం చేశారు. అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని పోలీస్‌ అధికారులకు సూచించారు. ‘మహానాడు’ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రేషన్‌ బియ్యం స్వాధీనం


బియ్యం స్వాధీనం చేసుకున్న అధికారులు

దువ్వూరు : మండలంలోని పెద్ద జొన్నవరంలోని ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 28 బస్తాల రేషన్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ప్రొద్దుటూరు విజిలెన్స్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీటీ మల్లికార్జున తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యం 17.5 క్వింటాళ్లు ఉంటాయని, వాటి విలువ రూ.79,542 ఉంటుందన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో అప్పగించామన్నారు. డీటీ మల్లికార్జున ఫిర్యాదు మేరకు రేషన్‌ బియ్యం నిల్వ ఉంచిన కొండా శేఖర్‌ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు దువ్వూరు ఎస్‌ఐ వినోద్‌ కుమార్‌ తెలిపారు.

కళాశాల గదుల వేలం వాయిదా

అధికార పార్టీ నేత ఒత్తిడే కారణమా?


వేలంపాట వాయిదా వేయడంతో వెనుదిరిగి వెళ్తున్న పాటదారులు

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని మలయాళస్వామి బీఈడీ కళాశాల గదుల వేలంపాట వాయిదా పడింది. పర్యవేక్షణ అధికారి రాకపోవడంతో వాయిదా వేశామని ఈఓ రామచంద్రాచార్యులు ప్రకటించారు. దీంతో దేవాదాయ శాఖకు మరింత నష్టం వాటిల్లినట్లయింది. అయితే స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధి ప్రమేయంతోనే వేలంపాట నిర్వహించలేదని, కళాశాల నిర్వాహకులకు అనుకూలంగా సదరు ప్రజాప్రతినిధి వ్యవహరించి ఫోన్‌ చేయడంతోనే వాయిదా వేశారని చర్చ సాగుతోంది. బహిరంగ వేలం నిర్వహిస్తే ఈ గదులకు నెలకు రూ.లక్ష వరకు ఆదాయం లభించే అవకాశం ఉన్నా.. అధికారుల తీరుతో అందకుండాపోయింది.

ఏడేళ్లుగా అద్దె చెల్లించలేదు

దేవాదాయ శాఖ ఆధ్వర్యం శ్రీకృష్ణ గీతాశ్రమంలో 7,744 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తుల్లో మలయాళ స్వామి బీఈడీ కళాశాల నిర్వహిస్తున్నారు. ఈ భవనాలకు ఏడేళ్లుగా కళాశాల నిర్వాహకులు అద్దె చెల్లించడం లేదు. కళాశాల యాజమాన్యం గతంలో కోర్టును ఆశ్రయించడంతో గత ఏడాది సెప్టెంబర్‌ 11న అప్పీల్‌ను కోర్టు కొట్టివేసింది. దీంతో ఈఓ ఏడేళ్ల బకాయిలు రూ.7 లక్షలు చెల్లించాలని పలుమార్లు నోటీసులిచ్చినా నిర్వాహకులు స్పందించలేదు. నాలుగు రోజుల కిందట కళాశాల భవనాలను ఈవో సీజ్‌ చేసి వేలం నిర్వహిస్తామని ప్రకటన విడుదల చేశారు. విషయం తెలుసుకున్న కళాశాలల నిర్వాహకులు వేలం పాటలో పాల్గొనేందుకు గీతాశ్రమానికి వచ్చారు. అయితే పర్యవేక్షణ అధికారి రాకపోవడంతో వాయిదా వేశామని ఈఓ తెలిపారు. పది రోజుల తర్వాత తిరిగి వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గతంలోనూ ఇలాగే..

దేవాదాయశాఖకు సంబంధించిన గదులను లోపాయికారీ ఒప్పందాలతో తక్కువ ధరకే అద్దెకు ఇస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. వేలం పాట నిర్వహణను పరిశీలించేందుకు బుధవారం ఆయన ఇక్కడికి వచ్చారు. ఈఓతో ఆయన మాట్లాడుతూ గతంలో లాగే జరుగుతోందని ఇక్కడికి వచ్చానని, ప్రస్తుతం అదే రీతిన వేలం పాట నిర్వహించకుండా వాయిదా వేశారని అన్నారు. గతంలో వేలం జరిపినట్లు రికార్డులు తయారుచేసి అతి తక్కువ బాడుగకు ఇచ్చారని ఆయన తెలిపారు. ఎవరైతే ఆశ్రమానికి వ్యతిరేకంగా కోర్టులో కేసులు వేశారో వారికే రూములను అప్పజెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పది రోజుల తర్వాత అయినా పారదర్శకంగా వేలం పాట నిర్వహించాలని ఈఓను కోరారు. నిబంధనలకు విరుద్ధంగా దేవాదాయశాఖ ఆదాయానికి గండి కొట్టొద్దని తెలిపారు. ఇలా జరిగితే న్యాయ పోరాటం చేస్తానన్నారు.

దివ్యాంగుడి బతుకుపోరాటం

అతడు పుట్టుకతోనే దివ్యాంగుడు. ఎవరిపైనా ఆధారపడకుండా మనోధైర్యంతో పట్టుదలతో ముందుకు వెళ్తున్నాడు. పేద కుటుంబంలో పుట్టినా.. మంచంపట్టిన తల్లిని చూసుకుంటూ తోబుట్టువుల సాయం లేకపోయినా స్వశక్తితో జీవనం సాగిస్తున్నాడు. మూడు చక్రాల బండే తనకు జీవనాధారం. ఆ బండితోనూ తన బ్రతుకు పోరాటం సాగిస్తున్నాడు. ఉన్న సొమ్మంతా తల్లి వైద్యానికి ఖర్చు చేయడంతో ఇపుడు చేతిలో చిల్లిగవ్వలేక కటిక పేదరికంతో అల్లాడిపోతున్నాడు.

మంచం పట్టిన తల్లిని కాపాడుకోలేక కన్నీరు మున్నీరు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని ఎద్దులాయపల్లె గ్రామానికి చెందిన పెగడ వెంకటేశ్వర్లు, పెగడ లక్ష్మమ్మ దంపతులకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. చిన్నప్పటి నుంచి కాయ కష్టం చేసి పిల్లలను పెంచారు. పెద్దవారిని చేసి వివాహాలు చేశారు. వీరికి దివ్యాంగుడైన చిన్న కుమారుడు వెంకటేశ్వర్లు ఉన్నాడు. కొన్నేళ్ల కిందట భర్త వెంకటేశ్వర్లు చనిపోవడంతో లక్ష్మమ్మ దివ్యాంగ కుమారుడికి తోడుగా ఉండేది. అన్నదమ్ములు ఎవరూ రాకపోయినా.. చిన్న కుమారుడు వెంకటేశ్వర్లు తల్లి ఆలనాపాలనా తనపై వేసుకొని జీవనం సాగించాడు. రెండు కాళ్లు పనిచేయకపోయినా రిక్షాపైనే పనులు చేసుకుంటూ.. తనకు వచ్చే పింఛనుతో జీవనం సాగించాడు. ఇటీవల విధి వంచించింది. అతడి తల్లి లక్ష్మమ్మకు ఏడాది కిందట కిందపడి కాలు విరగడంతో మంచానికే పరిమితమైంది. 105 ఏళ్లు నిండడంతో ఆమె వైద్యం కోసం అప్పు చేసి రూ 2.50 లక్షలు ఖర్చు చేశారు. అన్నదమ్ములు ఆదుకోకపోవడంతో అప్పులు తీర్చలేక, దివ్యాంగుడు కావడంతో ఏమి చేయాలో తోచక కన్నతల్లిని చూసుకుంటూ విలపిస్తున్నాడు వెంకటేశ్వర్లు. దాతలు ఆదుకుంటే తాను తల్లిని కాపాడుకుంటానని వేడుకుంటున్నారు. సాయం చేసేవారెవరైనా 9346687016, 8309431953లో సహకరించాలంటూ కోరుతున్నాడు.


తల్లితో దివ్యాంగుడు వెంకటేశ్వర్లు

విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ఉపకరణాలు

పాఠశాల ఆర్‌జేడీ కాగిత శామ్యూల్‌


పిల్లలకు వీల్‌ చైర్స్‌ అందిస్తున్న అధికారులు

కడప ఎడ్యుకేషన్‌ : విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ఉపకారణాలు అందించినట్లు జోన్‌ 4 పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్‌జేడీ) కాగిత శామ్యూల్‌ అన్నారు. స్థానిక సమగ్ర శిక్ష కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతులకు బుధవారం ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలింకో ఉపకరణాలు తయారుచేసి అందిస్తోందన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అర్హులను గుర్తించి వీల్‌ చైర్స్‌, సీపీచైర్స్‌, రోలేటర్స్‌ అందించామని తెలిపారు. ఉపకారణాలు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు, ప్రత్యేక ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమగ్ర శిక్ష అడిషనల్‌ ప్రాజెక్ట్‌ కో ఆర్డినేటర్‌ నిత్యానంద రాజు, విభిన్న ప్రతిభవంతుల శాఖ జిల్లా సంచాలకులు కృష్ణ కిశోర్‌ మాట్లాడుతూ ఉపకారణాలతో దివ్యాంగులు తమ లోపాలు అధిగమించి రాణించేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్‌, రమణమూర్తి, కేశవరెడ్డి, విశ్వనాథరెడ్డి, వీరేంద్ర, మమత, విజయమ్మ, పద్మ, గంగులప్ప, చంద్ర, రాజా, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది చేతివాటం

– సొమ్ము స్వాహా కేసులో ముగ్గురి అరెస్టు

బి.కొత్తకోట : ముత్తూట్‌ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. స్థానిక రంగసముద్రంరోడ్డులోని ముత్తూట్‌ ఫైనాన్స్‌ శాఖలో సొమ్ము జమచేయకుండా స్వాహా చేశారు. ఆలస్యంగా పోలీసులకు ఫిర్యాదు అందడంతో ముగ్గురు ఉద్యోగులను అరెస్టు చేసినట్లు ఇన్‌ఛార్జి సీఐ లక్ష్మన్న తెలిపారు. ఆయన కథనం మేరకు..ఫైనాన్స్‌ సంస్థ బ్రాంచ్‌లో మదనపల్లెకు చెందిన దూదేకుల ఇమ్రాన్‌బాషా(30), పెద్దతిప్పసముద్రం మండలం మల్లెలకు చెందిన జరిపిటి హరీష్‌(29), బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం పంచాయతీకి చెందిన ముగిలన్నగారి హరికృష్ణ (26) వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. కార్యాలయంలో బంగారు ఆభరణాలను కుదవపెట్టే ఖాతాదారులతో సొమ్ము వసూలు చేసినా.. బ్రాంచీలో జమ చేయకుండా స్వాహా చేస్తున్నారు. కొందరు ఖాతాదారులు ఇటీవల నగలు విడిపించుకునేందుకు రాగా ఇంకా రుణం పెండింగ్‌లో ఉందని, చెల్లిస్తే ఇస్తామని చెప్పడంతో ఖంగుతిన్నారు. ఈ విషయం దావానలంలా అందరికీ తెలియడంతో కొందరు ఖాతాదారులకు అనుమానం కలిగి తమ రుణాలపై ఆరా తీయగా ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ విషయం సంస్థ ఉన్నతాధికారులకు చేరడంతో విజిలెన్స్‌ బృందంతో విచారణ చేయించారు. అనుమానించినట్టుగానే ఆ ముగ్గురు సిబ్బంది రూ.65.76 లక్షలు సంస్థకు జమ చేయకుండా స్వాహా చేశారని తేలడంతో చర్యలు చేపట్టారు. రీజనల్‌ ఫైనాన్స్‌ మేనేజర్‌ ఎస్‌.దేవరాజు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి ముగ్గురిని హార్సిలీ హిల్స్‌ క్రాస్‌ వద్ద అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్‌ షాక్‌తో కార్మికుడి మృతి

మదనపల్లె రూరల్‌ : విద్యుత్తు షాక్‌తో సచివాలయ పారిశుద్ధ్య కార్మికుడు మృతిచెందిన సంఘటన పుంగనూరు మండలంలో జరిగింది. మండలం లోని చంద్రమాకులపల్లె గ్రామానికి చెందిన రెడ్డప్ప(55) స్థానిక సచివాలయంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. బుధవారం తన ఇంటికి సమీపంలోని మునగ చెట్టుపైకెక్కి ఆకు కోస్తుండగా ప్రమాదవశాత్తూ పక్కనే ఉన్న విద్యుత్తు తీగ తగిలి షాక్‌కు గురయ్యాడు. చెట్టుపై నుంచి కింద పడి అపస్మారక స్థితికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగం వైద్యులు అప్పటికే రెడ్డప్ప మృతిచెందినట్లు నిర్ధారించారు. రెడ్డప్పకు భార్య శోభ, కుమార్తెలు శిరీష, శ్రీవిద్య ఉన్నారు. కేసు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు


గాయపడ్డ చరణ్‌

వల్లూరు : మండలంలోని కొప్పోలు బస్టాపు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు... పిఠాపురానికి చెందిన కూలీలు కుమారునిపల్లె సమీపంలోని ఇటుకల బట్టీల వద్ద పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి వల్లూరు బస్టాపు వద్దకు భోజనానికి వెళుతుండగా.. కొప్పోలు బస్టాపు సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో కూలీల్లో ఒకరైన చరణ్‌ గాయపడ్డాడు. అదుపు తప్పి కింద పడడంతో వాహనదారుడికి గాయాలయ్యాయి. 108 వాహనంలో కడప రిమ్స్‌ ఆసుపత్రికి తరలించారు.

వైవీయూలో స్నాతకోత్సవ సందడి

యోగి వేమన విశ్వ విద్యాలయం విద్యార్థులతో సందడిగా కనిపిస్తోంది. కాన్వకేషన్‌కు దరఖాస్తు గడువు ఈ నెల 31వతేదీతో ముగుస్తుండడంతో విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఇటీవల పీజీ నాలుగో సెమిస్టర్‌ ఫలితాలు విడుదల కావడంతో ఉత్తీర్ణులంతా పట్టా పొందడానికి సిద్ధం అవుతున్నారు. ఈ నెల 31వతేదీ వరకూ గడువు ఉందని, దరఖాస్తుల స్వీకరణకు కొన్ని విభాగాలను ఏర్పాటు చేశామని వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్‌వీ. కృష్ణారావు తెలిపారు. – కడప ఎడ్యుకేషన్‌


సర్టిఫికెట్లు సిద్ధం చేసుకుంటున్న విద్యార్థినులు


ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసుకుంటూ


ఆఫీసులో వివరాలను తెలుసుకుంటున్న విద్యార్థులు